ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 14 ఏప్రిల్ 2024





ప్రత్తిపాడు సభకు హాజరైన జన సందోహం



రాజధాని.. అమరావతే

ప్రజాగళం.. నూతనోత్తేజం



ప్రత్తిపాడులో కండువాలు ఊపుతూ ఉత్సాహపరుస్తున్న చంద్రబాబు, రామాంజనేయులు, పెమ్మసాని



తాడికొండలో వేదికపై ప్రసంగిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్



తాడికొండ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

- ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి
- 30 రోజుల్లో రాష్ట్రంలో మారనున్న చరిత్ర
- జూన్ 4న జగనాసుర వధ.. అమరావతి వేడుక
- మళ్లీ జగన్‌కు ఓటేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లే
- అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం
- తాడికొండ, ప్రత్తిపాడు ప్రజాగళం సభల్లో చంద్రబాబు

తాడికొండ, ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: ప్రపంచంలో తెలుగు వారు గర్వపడేలా రాజధాని అమరావతిని నిర్మిస్తా. అమరావతే ఆంధ్రుల రాజధాని. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే రోజే అమరావతే రాజధాని అని మీరంతా వేడుక జరుపుకునే రోజు. అదేరోజున జగనాసుర వధ.. అమరావతి రక్షణ రెండూ జరుగుతాయి. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. ప్రజలు గెలవాలి.. జగన్ పోవాలి.. అని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో జరిగిన ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే కరెంటు తీగలు పట్టుకున్నట్లేనన్నారు. మరో 30 రోజుల్లో రాష్ట్రంలో చరిత్ర మారుతుందన్నారు. రాజధాని అంటే ఆత్మ గౌరవం.. ఆత్మవిశ్వాసం.. గర్వంగా చెప్పుకునే ప్రజల ఆస్తి అన్నారు. హైదరాబాద్‌కు ధీటుగా, దేశంలో నెంబర్ వన్‌గా, ప్రపంచంలో గొప్ప నగరాల్లో ఒకటిగా చెప్పుకునే రాజధానిని నిర్మించాలనుకున్నా కానీ మూడు రాజధానులంటూ అమరావతిని జగన్ సర్వనాశనం చేశారన్నారు. విట్, అమృత, ఎస్ఆర్ఎం వంటి ప్రపంచస్థాయి విద్యాసంస్థలతో అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా మార్చాలనుకుంటే జగన్ సర్వనాశనం చేశాడన్నారు. అమరావతి రైతులు, మహిళల పోరాటం అమోఘం.. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. 3 వేల కేసులు.. అడు గడుగునా అవమానాలు, పోలీసుల హింస, జైల్లో పెట్టి వేధింపులు.. ఎన్ని చేసినా పోరాటం ఆపలేదని, వారి పోరాటంతోనే అమరావతి గెలిచింది.. నిలిచిందన్నారు. రాష్ట్రం బాగుండాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు.

- తాడికొండ, ప్రత్తిపాడు పసుపుమయం
- చంద్రబాబు రాకతో పులకించిన జనం

ప్రజల కేరింతలు.. తెలుగు తమ్ముళ్ల జయజయధ్వానాలు.. యువత సందడి.. మహిళల హారుతులు.. పసుపు జెండాల రెపరెపల మధ్య శనివారం తాడికొండ, ప్రత్తిపాడుల్లో చంద్రబాబు ప్రజాగళం కార్యక్రమం జరిగింది. రోడ్ షో, బహిరంగ సభలకు జనం పోటెత్తారు. చంద్రబాబు పర్యటన మార్గాలు జనాలతో కిటకిటలాడాయి. ప్రజాగళంతో కూటమి పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ప్రజాగళం కార్యక్రమాలకు సమీప మండల గ్రామాల నుంచి భారీగా జనం ఉత్సాహంగా తరలివచ్చారు. చంద్రబాబును చూసిన ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. తాడికొండ, ప్రత్తిపాడు ప్రధాన కూడళ్లు పసుపు జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయాయి. హెలికాప్టర్‌లో తాడికొండకు వచ్చిన చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. హెలి ప్యాడ్ నుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ తాడికొండలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సభా స్థలి వద్దకు చేరుకుని ప్రసంగించారు. ఈ సభకు రాజధాని పరిధిలోని గ్రామాల నుంచి మహిళలు, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబు కోసం ఎదురు చూశారు. సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు జెండాలతో మద్దతు తెలిపారు. సభ అనంతరం చంద్రబాబు హెలికాప్టర్‌లో ప్రత్తిపాడుకు చేరుకున్నారు. చంద్రబాబు రాకతో ప్రత్తిపాడు పులకించిపోయింది. ఆయన రాక సందర్భంగా ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. ఆయా సభలో చంద్రబాబు తమ్ముళ్లూ అంటూ పలకరించిన తీరు.. నా ఆడబిడ్డలు అంటూ చూపిన ఆప్యాయతతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఆయా సభల్లో గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ, ప్రత్తిపాడు అభ్యర్థులు తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మతో అలింగనం



చంద్రన్నకు దిష్టితీస్తూ..



ప్రత్తిపాడులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు



తాడికొండలో సభలో మహిళల అభివాదం



ప్రత్తిపాడు సభలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు



ప్రత్తిపాడులో మిద్దెలపైకెక్కిన అభిమానులు



గజమాలతో స్వాగతం

మిర్చి ధర పతనం

గుంటూరు యార్డులో సగం తగ్గిన వైనం

- క్వింటా రూ.20 వేల నుంచి రూ.10 వేలకు తగ్గుదల
- కొన్ని రకాలకు ఆశించిన ధర రాక రైతు కంట కన్నీరు
- శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుంటున్న రైతులు



గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర రోజురోజుకు పతనమవుతోంది. సీజన్ ప్రారంభం(జనవరి)లో క్వింటాల్ రూ.20 వేల వరకు ఉన్న మిర్చి ధర నేడు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయింది. ప్రకృతి విపత్తులను తట్టుకుని పంట పండించినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో ఉన్న ధరతో పోల్చి చూస్తే ప్రస్తుతం దాదాపుగా 50 శాతం పతనమైంది. ఏమి చేయాలో దిక్కుతోచని రైతులు రాబోయే రోజులపై ఆశలు పెట్టుకుంటూ తమ వద్ద ఉన్న మిర్చిని శీతలగిడ్డంగుల్లో నిల్వ చేసుకుంటున్నారు. గుంటూరు పరిసరాల్లో ఇప్పటికే కోల్డ్‌స్టోరేజ్‌లు సామర్థ్యం మేరకు నిండిపోయాయి. నేటికీ రోజుకు లక్షన్నర మిర్చి టిక్కీలు వస్తుండటంతో వాటిని నిల్వ చేసే పరిస్థితి లేక మార్కెట్‌లో వచ్చిన ధరకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. విదేశాలకు ఎగుమతులు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు మిర్చిని గుంటూరు మిర్చియార్డుకు తీసుకొస్తుంటారు. అయితే గత ఏడాది శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చి టిక్కీలలో 20 లక్షలు ఈ సంవత్సరం సీజన్ ప్రారంభం నాటికి కూడా రైతులు విక్రయించుకోలేకపోయారు. ఇందుకు కారణం ఆశించిన ధర లేకపోవడమే. ఒకపక్క కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వలు, మరోవైపు మార్కెట్‌కి కొత్త పంట పోటెత్తడంతో ధర క్రమేపి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌కి రెండు, మూడో కోతల్లో కోసిన మిరపకాయలను రైతులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం సింజెంటా బ్యాడిగి క్వింటాల్ ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే లభిస్తుంది. గత ఏడాది ఈ రకానికి క్వింటాల్ రూ.30 వేలకు పైగా ఇక్కడ ధర లభించింది. విత్తన రకాలైన ఆర్మూరు, నెంబరు 341, క్లాసిక్ వంటివి రూ.8 వేల నుంచి రూ.10 వేల మధ్య ఉన్నాయి. ఎక్స్‌పోర్టు క్వాలిటీ తేజ గత ఏడాది క్వింటాల్ రూ.26 వేల వరకు ఉండగా నేడు రూ.12 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే ఉన్నది. డీలక్స్‌కి మాత్రం రూ.17 వేల నుంచి రూ.19 వేలు ఇస్తున్నారు. తాలుకాయలు రూ.12 వేల వరకు సీజన్ ప్రారంభంలో ఉండగా నేడు రూ.4 వేల నుంచి రూ.7 వేలకు తగ్గిపోయాయి.

పట్టించుకోని ప్రభుత్వం

మార్కెట్‌లో ధర పతనం అయినప్పుడు మార్క్‌ఫెడ్‌ని రంగంలోకి దింపి రైతుల వద్ద ఉన్న మిర్చిని కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కనీసం ప్రభుత్వ పరంగా మిర్చిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన సదుపాయాలను కూడా కల్పించడంలేదు. గుంటూరు పరిసరాల్లో 85 వరకు ఫంక్షనల్ కోల్డ్‌స్టోరేజ్‌లున్నాయి. ప్రమాణాలు సక్రమంగా పాటించే ఏ కేటిగిరి కోల్డ్‌స్టోరేజ్‌లు 20 రోజుల క్రితమే నిండిపోయాయి. బీ కేటిగిరీ కూడా రెండు రోజుల క్రితం ఫుల్ అయ్యాయి. 10 నుంచి 12 మాత్రమే ఉన్న సీ-కేటిగిరీ కోల్డ్‌స్టోరేజ్‌లలోనూ రైతులు తమ మిరపకాయలను స్టాకు పెట్టడం ప్రారంభించారు. అవి కూడా వారం వ్యవధిలోనే నిండిపోవచ్చని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నాయి. సీజన్ ముగియడానికి ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ధర మరింత తగ్గే అవకాశం లేకపోలేదు.



ఇంకా శ్లాబు దాటని ముఖద్వారం పనులు

కేంద్రం నిధులు.. వైసీపీ ఆర్భాటం

- ఎన్నికల ముందు ప్రారంభోత్సవంపై విమర్శలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13: సీఎం జగన్ నిధులు లేకుండానే ఉత్తిత్తి బటన్లు నొక్కుతున్నారు. రోజులు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కావడంలేదు. ఇదే కోవలో పల్నాడులో వైద్య కళాశాల పరిస్థితి కూడా మారింది. కేంద్రం నిధుల వరకే పనులు చేపట్టి.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా.. పనులను పూర్తి చేయకుండా వైసీపీ నేతల ఆర్భాటపు ప్రారంభోత్సవంపై ప్రజలతో పాటు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. వైద్య కళాశాల, ఆస్పత్రి భవనాల నిర్మాణం పూర్తి కావాలంటే ఇంకా రెండేళ్లకు పైగా పడుతుంది. అయినా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని చెప్పేందుకు పూర్తి అయిన కొన్ని భవనాలకు రంగులు వేసి ఈ ఏడాది ఫిబ్రవరి 26న ప్రారంభోత్సవం చేశారు. ఆస్పత్రిని ఆరు బ్లాకుల్లో రూ.500 కోట్లతో నిర్మించాల్సి ఉండగా, ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికి రూ.150 కోట్ల మేర పనులు మాత్రమే జరిగాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు ఒకటి, రెండు బ్లాక్‌లకు రంగులు వేసి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ప్రారంభించారు. నిర్మాణాలు పూర్తికాకుండానే ఎన్నికల స్టంట్‌గా ప్రారంభోత్సవం చేయడంపై టీడీపీ, బీజేపీ, ప్రజాసంఘాల నేతలు వైసీపీ నేతల తీరుపై మండిపడుతున్నారు.

ప్రజలను మభ్య పెట్టేందుకేనా..

సాధారణంగా అన్ని పనులు పూర్తి అయ్యి.. తరగతుల నిర్వహణకు అనుమతులు వచ్చిన తర్వాత.. కళాశాలను ప్రారంభించాలి. కానీ ఇక్కడ మాత్రం అవేవీ లేకుండానే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ప్రారంభించడంపై అటు ప్రతిపక్షాలు, ఇటు ప్రజలు మండిపడుతున్నారు. పనులు పూర్తికాకుండానే వైద్య కళాశాల ప్రారంభించిన వైసీపీ నేతలు నవ్వుల పాలయ్యారు.

అసత్య ప్రచారం

బ్రాహ్మణపల్లి సమీపంలో వైద్య కళాశాలకు 2021 మే 30న సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలి. అయితే ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే పనులు సాగాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయని కారణంగానే పనుల్లో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు సమాచారం. అయితే వైసీపీ నేతలు కేంద్రం మాటెత్తకుండానే నిధులన్నీ తమవేనని, తమ కృషి వల్లే వైద్య కళాశాల వచ్చిందంటూ ఊరూరా ప్రచారం చేసుకుంటున్నారు. దీనిపై బీజేపీ నేతలు, ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

భూ కొనుగోలు మాయ

వైద్య కళాశాల, ఆస్పత్రి నిర్మాణానికి సుమారు 42 ఎకరాలు భూమిని కొనుగోలు చేయాల్సి వచ్చింది. అక్కడ ధర ఎకరం 15 నుంచి 20 లక్షల రూపాయల లోపు ఉంది. అయితే వైసీపీ నేతలు రంగ ప్రవేశం చేసి ప్రభుత్వం చేత ఎకరం రూ.25 లక్షలకు కొనుగోలు చేయించారు. ఇదో పెద్ద కుంభకోణమని, వైసీపీ నేతల అవినీతి దాగి ఉందని, రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. అయితే దీనిపై అటు ప్రభుత్వం, ఇటు అధికారులు నోరుమెదపలేదు.

'మనూ'లో కోర్సులు

దిక్సూచి

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- వెబ్‌సైట్: www.manuu.edu.in

ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా...

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం)

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ.

ప్రొఫెషనల్ డిప్లొమాలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

అకడమిక్ మెరిట్ ద్వారా...

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)

ఇవి కాకుండా ఫుల్‌టైమ్ పార్ట్ టైమ్ కోర్సులు మరికొన్ని కూడా ఉన్నాయి.

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు: హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు అందిస్తోంది.

(ఇవి కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని క్యాంపస్‌ల్లో ఉన్న కోర్సులు - అర్హతలు తదితరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.)

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZmApBfvలో చదవండి.

చిత్ర పరిశ్రమకు, అభిమానులకు అంకితం

- రామ్‌చరణ్



హీరో రామ్‌చరణ్ 'గౌరవ డాక్టరేట్' అందుకున్నారు. సినీ, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలకు గాను చెన్నైలోని ప్రముఖ 'వేల్స్ యూనివర్శిటీ' ఆయనకు శనివారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, యూనివర్శిటీ వ్యవస్థాపకుడు, ఛాన్స్‌లర్ డాక్టర్ ఐసరి గణేశ్ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ... 'నా పై ఇంత అభిమానంతో గౌరవ డాక్టరేట్ బహూకరించిన వేల్స్ వర్శిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు. 38 ఏళ్లుగా నడుస్తున్న యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వస్తోందంటే ముందు మా అమ్మే నమ్మలేదు. ఆర్మీలాంటి గ్రాడ్యుయేషన్స్ మధ్య నేను ఇలా ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నా తల్లిదండ్రులకు, అభిమానులకు, దర్శకులకు, నిర్మాతలకు, తోటి నటీనటులకు అంకితమిస్తున్నా.' అన్నారు. తాను చెన్నైలోని విజయా హాస్పిటల్లోనే జన్మించానని, పద్మశేషాద్రి స్కూల్లో చదివానన్నారు. ఈ ప్రాంతం తనకెంతో ఇచ్చిందన్నారు. తన తండ్రి చిరంజీవి జీవన ప్రయాణం కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారన్నారు. తన సతీమణి ఉపాసన కుటుంబం అపోలో హాస్పిటల్స్‌ను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించిందన్నారు. 80 శాతం తెలుగు సినిమాలు ఇక్కడే రూపొందేవని, తెలుగు సినీ పరిశ్రమకు ఇది పుట్టిల్లులాంటిదన్నారు. ఏదైనా సాధించాలని కలలు కని, చెన్నైకి వస్తే అది తప్పకుండా నెరవేరుతుందని వ్యాఖ్యానించారు. అది ఈ ప్రాంతం గొప్పతనమన్నారు. అన్ని రంగాల వారికి ఈ భూమి కలలు నెరవేర్చేదన్నారు. తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తను నటిస్తున్న గేమ్ చేంజర్ మూవీ సెప్టెంబర్-అక్టోబరు నెలల్లో విడుదలయ్యే అవకాశముందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి, చెన్నై.

జీరో బడ్జెట్‌తో శరపంజరం



గంగిరెద్దుల అబ్బాయితో జోగిని ప్రేమలో పడితే ఎటువంటి పరిణామాలు సంభవించాయన్న ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న 'శరపంజరం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. నవీన్‌కుమార్ గట్టు, లయ జంటగా నటించారు.ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నవీన్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాను. ఎంతో మంది మిత్రులు నాకు అండగా నిలిచారు. జీరో బడ్జెట్‌తో కేవలం స్నేహితుల సహకారంతో ప్రారంభించిన ఈ యజ్ఞం పూర్తి చేసి విడుదల వరకూ వచ్చాం. గణపతిరెడ్డి మాకు ఎంతో సహకరించారు.' అని చెప్పారు. సంగీత దర్శకుడు మల్లిక్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందనీ, ఆకలితో ఉన్న వాడికి అన్నం పెడితే జీవితాంతం గుర్తుంచుకుంటాడని, ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలనీ గణపతిరెడ్డి అన్నారు.

వినోదం పంచే కొంచెం హట్కే



గురుచరణ్, కృష్ణ మంజూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కొంచెం హట్కే'. అవినాశ్ కుమార్ దర్శకత్వంలో అభిమాన థియేటర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇందులో హీరో హీరోయిన్లు ఉండరు. పాత్రలే ఉంటాయి. సినిమా వినోదాత్మకంగా ఉంటుంది' అన్నారు. కొంతమంది కలసి సినిమా తీయడానికి చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయని గురుచరణ్ తెలిపారు.

గొప్ప కంటెంట్‌తో టెనెంట్

సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించారు. ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నటుడు ప్రియదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యం రాజేశ్ మాట్లాడుతూ 'డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. ఇందులో గొప్ప కంటెంట్ ఉంది. ప్రేక్షకులు ప్రతి క్షణం ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మహిళలకు కనెక్ట్ అయ్యే



కథ ఇది. మా నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే చిత్రమవుతుంద'న్నారు. నిర్మాత మాట్లాడుతూ "బలగం, కాంతార' లాంటి సహజత్వం ఉన్న కథతో తెరకెక్కిన సినిమా 'టెనెంట్'. ఈ చిత్రంలో భావోద్వేగాలు అద్భుతంగా పండాయి' అని చెప్పారు.

మేకప్ మాన్‌కు క్లాప్



దివంగత నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మేకప్ మ్యాన్'. దివాకర్ యడ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కుమార్ మెట్టుపల్లి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టగా, లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ప్రతి చిత్రానికి కీలకమైన మేకప్ మ్యాన్‌ల పాత్రను, వారి జీవితాన్ని ఇందులో చూపించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో కట్టా రంజిత్, ఆనంద్ భారతి, చిట్టిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డిఓపి, ఎడిటర్: వాసు వర్మ, సంగీతం: ఎం ఎం శ్రీలేఖ.

నవ్య 'దృశ్యం'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zvr6wiU లో చదవండి.

రాజధానికి భూములిస్తే రోడ్డు పాలు చేశారు

- 1579 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఏప్రిల్13: రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు భూములు ఇస్తే మూడు రాజధానులని తమను రోడ్డు పాలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి పుట్టగతులుండవని రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1579వ రోజుకు చేరున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, రాజధాని అమరావతిని స్వాగతిస్తున్నామని ఎన్నికల ముందు చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట మొదలు పెట్టి అమరావతిని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల అంశాన్ని అమలు చేయాలని అనుకోవటం పెద్ద తప్పిదమన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించాలని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

కొండవీడుకోటలో బయల్పడిన శాసనం

కొండ వీడు కోట(యడ్లపాడు), ఏప్రిల్ 13: పల్నాడుజిల్లా యడ్లపాడు మండలం కొండవీడుకోటలో క్రీశ 15వ శతాబ్దానికి చెందిన శాసనం బయల్పడినట్లు కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు. కొండవీడుకోటలో మండపాలుగా పిలువబడే నాలుగు నిర్మాణాలు ఉన్నాయని, వాటిలో రెండింటిని గుర్రపుశాల, రెడ్డిగారి భోజనశాలలుగా వాడుకలో ఉన్నాయన్నారు. మిగిలిన రెండింటిని మండపాలుగానే గుర్తిస్తున్నారు. పుట్టాలమ్మ చెరువుకు పడమర దిక్కున ఉన్న శిథిల మండపంలోని ఓ రాతి స్తంభంపై పెద్దకోమటి వేమారెడ్డికి చెందిన శాసనం బయల్పడిందన్నారు. దానితో పాటు మండపంలోనే మరో మూడు శాసనాలు కూడా లభ్యమయ్యాయన్నారు.



కొండవీడుకోటలోని పుట్టాలమ్మ చెరువు సమీపంలో రంగ మండపం రాతి స్థంభంపై బయల్పడిన 15వ శతాబ్దం నాటి శాసనం

మంగళగిరి ప్రజల మనసులు గెలుస్తా

- మార్పు కోసమే వచ్చా.. మంగళగిరి చరిత్ర తిరగ రాస్తా..
- పసుపు జెండా ఎగరేసి అభివృద్ధికి చిరునామాగా మారుస్తా
- ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్



కుంచనపల్లి సమృద్ధి అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న లోకేశ్



లోకేశ్‌కు హారతులిస్తున్న అపార్టుమెంట్ వాసులు

తాడేపల్లి, ఏప్రిల్ 13: మార్పు కోసమే మంగళగిరికి వచ్చా. 1985 తర్వాత ఇక్కడ టీడీపీ గెలవలేదు. ఈసారి పసుపు జెండా ఎగరేసి చరిత్ర సృష్టిస్తా.. మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మార్చి ప్రజల మనసుల్లో స్థానం సంపాదిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ అన్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లి సమృద్ధి అపార్టుమెంట్ వాసులతో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మంగళగిరిలో ఓడిపోయినా, నా సొంతం అనుకుని నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలు అందిస్తున్నానని, సొంత డబ్బుతో 29 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచానన్నారు. శాసనసభ్యునిగా ఎన్నికయ్యాక పేదరికం లేని మంగళగిరిగా తీర్చిదిద్ది మంగళగిరి మోడల్‌ను దేశానికి పరిచయం చేస్తానన్నారు. ప్రజలు కోరకపోయినా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసి పన్నుల భారం పెంచారని మౌలిక సదుపాయాలు విస్మరించారన్నారు. పంచాయతీలుగానే కొనసాగించాలని అనేక గ్రామాల ప్రజలు కోరుతున్నారన్నారు. కార్పొరేషన్ అంశం కోర్టు పరిధిలో ఉందని ప్రజాభీష్టం మేరకు ఈ రెండింటిని మున్సిపాలిటీగా మార్చి పన్నుల భారం తగ్గిస్తానన్నారు. నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజి నిర్మాణంతోపాటు కుళాయి ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తానన్నారు.

బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్‌తో అభివృద్ధి

బ్లాక్ డెవలప్‌మెంట్ విధానంలో రోడ్లు, పార్కులు, ఆరోగ్య కేంద్రాలు, ఏర్పాటు చేస్తామని లోకేశ్ చెప్పారు. 25 ఏళ్లగా రెండు కుటుంబాలను ఆదరించారని, వారు ఒక్క పరిశ్రమ గానీ ఉద్యోగం గానీ తీసుకురాలేక పోయారన్నారు. స్వర్ణకారులు అధికంగా ఉన్నందున మంగళగిరిలో గోల్డ్ సెజ్ ఏర్పాటు చేసి 30 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు ప్రోత్సాహకాలు అందించి నియోజకవర్గానికి అనేక ఐటీ పరిశ్రమలు తీసుకువస్తే జగన్ వచ్చాక అవన్నీ తరలి పోయాయన్నారు. మంగళగిరికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలిచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఈ ఎన్నికల్లో 53500 ఓట్ల భారీ మెజారిటీతో నన్ను గెలిపిస్తే చంద్రబాబు, పవన్‌తో దెబ్బలాడి నిధులు తీసుకొస్తానన్నారు.

సమస్యలు విన్నవించిన అపార్టుమెంటు వాసులు

సమృద్ధి అపార్టుమెంట్ వాసులు పలు సమస్యలు లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, ఇందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు స్థానికంగా ఉపాధి ఏర్పాటు చేయాలని, అమరావతిలో స్థలాలు కొంటే పట్టాలు ఇవ్వలేదని, యానిమేషన్ రంగాన్ని ప్రోత్సహించాలని, రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. యువనేత లోకేశ్ స్పందిస్తూ మంగళగిరి నియోజకవర్గంలో పసుపు, మిర్చి వంటి స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు లాభసాటి చేస్తామని, సాంప్రదాయ కోర్సులతోపాటు విద్యతో పాటు ఉపాధి కల్పించే ప్రాసెసింగ్ కోర్సులు ప్రవేశపెడతామని, కేజీ నుంచి పీజీవరకు సిలబస్‌లో మార్పులు తెస్తామని లోకేశ్ చెప్పారు.

టీడీపీలో చేరిన రావి వెంకటరమణ

- భారీగా తన అనుచరవర్గంతో సభకు వచ్చిన రావి



ప్రసంగిస్తున్న రావి వెంకటరమణ,పక్కన చంద్రబాబు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో సుమారు 350మంది పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ గూటికి చేరారు. తొలుత గుంటూరు జాతీయ రహదారి నుంచి రావి వెంకట రమణ భారీర్యాలీతో ప్రత్తిపాడు చేరారు. పార్టీలో చేరిన అనంతరం చంద్రబాబు సమక్షంలో రావి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అధికా రంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ప్రజలకు తాగునీరు కూడా అందించలేని ఈ ప్రభుత్వం ఉన్నట్టా అని ప్రశ్నించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేశానని, ఆ పార్టీ వలన ఈ ప్రజలకు ఉపయోగం లేదన్నారు. రేపటి భవిష్యత్తుకు చంద్రబాబు అవసరం అన్నారు. అనంతరం చంద్రబాబు ప్రసంగంలో కూడా రావి వెంకటరమణను కొనియాడారు. 2004లో ఇక్కడ ఎమ్మెల్యేగా చేయడంతో పాటు పొన్నూరు నుంచి పోటీ చేశారని, బాగా కష్టపడి చేసే వ్యక్తికి ఆ పార్టీలో అన్యాయం జరిగిందన్నారు. మంచి వ్యక్తుల్ని మనం వదిలి పెట్టుకోకూడదన్నారు.

టీడీపీలోకి రావి రాకతో వైసీపీకి భారీ ఝులక్..

తెలుగుదేశం పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ రావడం వైసీపీకి భారీ నష్టమే కలిగింది. 2004 నుంచి 2009 వరకు ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఉన్న రావి వెంకటరమణకు ఇప్పటికీ నియోజకవర్గంలో గట్టి పట్టే ఉంది. ఎస్సీ రిజర్వేషన్ తరువాత ఇక్కడ మేకతోటి సుచరిత ప్రాతినిధ్యం వహించినా నేటికి నియోజకవర్గంలో ఆయన స్థానం పదిలంగానే ఉంది. నియోజకవర్గంలోని వైసీపీ క్యాడర్ నాయకులకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటున్న ఆయన వెంట నడిచేందుకు పెద్దఎత్తున పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న జగన్ సామాజికవర్గానికి చెందిన కొత్త మల్లాయపాలెం గ్రామం నుంచి కూడా మాజీ సర్పంచ్ వణుకూరి వీరారెడ్డి సైతం రావితో అడుగులు వేశారు. అంతేకాకుండా పాత మల్లాయపాలెం నుంచి కూడా ఆయనకు ఆదరణ లభిస్తుంది. నిమ్మగడ్డవారిపాలెం సర్పంచ్ భర్త గొరిజవోలు సతీష్, పెదనందిపాడు మండల మాజీ వైస్ కన్వీనర్ మదమంచి వాసు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ కమ్మా శివప్రసాద్, ఏబీపాలెం సర్పంచ్ రావిపాటి కృష్ణప్రసాద్, ముప్పాళ్ల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ గుంటుపల్లి రవిబాబు, రాజుపాలెం సర్పంచ్ కమ్మా నాగమల్లేశ్వరరావు, కుర్రా శివనాగేశ్వరరావులతో పాటు పొన్నూరు, గుంటూరు నియోజకవర్గాలకు చెందిన సుమారు 350మంది రావితో టీడీపీలోకి వచ్చారు. వైసీపీలో సీనియర్ నాయకులు టీడీపీ గూటికి చేరడంతో వైసీపీకి గట్టి ఝులక్ తగిలింది.

ఎమ్మెల్యే కోన ప్రచారంలో వలంటీర్



కోన రఘుపతి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ ఊటుకూరి పావని

బాపట్లరూరల్, ఏప్రిల్ 13: ఎలక్షన్ కమీషన్ ఆదేశాలను లెక్క చేయకుండా వలంటీర్లు వైసీపీ నాయకుల ప్రచారంలో పాల్గొంటూనే ఉంటున్నారు. శనివారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించగా ప్రచారంలో ఆగ్రామానికి చెందిన ఊటుకూరి పావని అనే వలంటీర్ పాల్గొన్నారు. వలంటీర్లు ప్రచారంలో పాల్గొనటం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు.

కాచిగూడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 13: కాచిగూడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో ఆగిన సందర్భంగా రైల్వే ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. డిఫెన్స్‌కు చెందిన సుమారు రూ.75వేల విలువైన 31 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వీటిని కలిగివున్న ప్రకాశం జిల్లా, గిద్దలూరు తాలూకా, రామాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి

- చంద్రబాబుకు రైతుల వినతి

రేపల్లె, ఏప్రిల్ 13: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా పసుపు రైతులు తీవ్రంగా నష్టపోయామని రైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నష్టపోయిన పసుపు రైతులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం జనవరి 19తేదీన దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులు నిల్వ చేసుకున్న సుమారు లక్షా నాలుగు వేల పసుపు బస్తాలు కాలిపోయాయని వీటి మార్కెట్ విలువ రూ.115కోట్లు ఉంటుందని తెలిపారు. కోల్డ్‌స్టోరేజీ యజమాని కేవలం రూ.40కోట్లకు మాత్రమే ఇన్సూరెన్స్ చేశారని, ఒక్కో రైతుకు కేవలం క్వింటాకు రూ.5వేలు వస్తుందని తెలుపుతున్నారని దీని కారణంగా ఒక్కో క్వింటాకు రూ.10వేలు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు కోల్డ్‌స్టోరేజీ యజమాని ఇన్సూరెన్స్ సిబ్బంది ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని నష్టపోయిన రైతులకు అన్ని విధాలా ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్వింటాకు రూ.10వేలు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య రైతులు వైవీ సుబ్బారావు, పీవీ రాఘవరావు, సాంబశివరావు, వి.రఘురామ్, వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం



చిలకలూరిపేటకు సమీపంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న రూరల్ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

తాడికొండ, చిలకలూరిపేట, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడికొండ అడ్డరోడ్డులో పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. శనివారం వాహనాలను తనిఖీలు చేస్తున్న సమయంలో గోరంట్ల గ్రామానికి చెందిన దాడి శివబాబు వద్ద రూ.1.76లక్షలు పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవటంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకొని స్క్వాడ్ ఇన్‌చార్జ్ టీజీ బొల్లారెడ్డికి అప్పగించారు.

చిలకలూరిపేట వద్ద...

చిలకలూరిపేట-పెదనందిపాడు మార్గంలో శనివారం వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో కారులో వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద రూ.9.30లక్షల నగదును గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.రవికృష్ణ, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ మిట్టపాలెం గ్రామ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదనందిపాడు మండలం అన్నవరానికి చెందిన నల్లపనేని సుబ్బారావు ఈ నగదును ఒక ప్లాస్టిక్ సంచిలో పెట్టుకొని తీసుకువెళ్తున్నట్టు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు గాని, బిల్లులుగాని అతడు చూపలేదు. దీంతో నగదును వారు స్వాధీనం చేసుకున్నారు.

- దాచేపల్లి: పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఓ మిర్చివ్యాపారి నుంచి రూ.2.23 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని తెక్కళ్లపాడు గ్రామానికి చెందిన పలుసులేటి అంకమ్మరావు మిరియాలగూడెంలోని మిర్చియార్డులో మిర్చి అమ్ముకొని నగదుతో తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించగా ఎన్నికల కోడ్ మేరకు అతని వద్ద పరిమితికి మించి నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మహేందర్ మృతదేహం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 13: పరీక్షల్లో ఫెయిల్ అవడంతో ఇంటర్ విద్యార్థి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల మండలం కంభంపాడులో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇర్ల మహేందర్ (17) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివాడు. శుక్రవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో సబ్జెక్టులు ఫెయిలవడంతో మనస్తాపం చెందాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

91 మంది వలంటీర్లు రాజీనామా

కొల్లూరు, ఏప్రిల్ 13: కొల్లూరు మండలంలో 91మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ రాజీనామాలు చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లూరు మూడు సచివాలయాల పరిధిలో 32మంది, జువ్వలపాలెంలో 12మంది, క్రాపలో 10మంది, చినపులివర్రు 7, దోనేపూడి 19, వీరుకాక మరో 10మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు సమర్పించారు. మరి కొంతమంది చేత కూడా రాజీనామాలు చేయించే పనిలో వైసీపీ నాయకులు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లుగా మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

గుంటూరు జంక్షన్ అంటే అంత చిన్నచూపా!

- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు

గుంటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ హెడ్‌క్వార్టర్స్ అయిన గుంటూరు రైల్వేజంక్షన్ విషయంలో రైల్వే శాఖ చిన్నచూపు చూస్తోంది. తాజాగా 14 ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటు చేసిన ఈస్టు కోస్టు రైల్వే శాఖ వాటిని గుంటూరు మీదగా నడుపుతూ ఇక్కడ నిలుపుదల సౌకర్యాన్ని కల్పించలేదు. దీనిపై జెడ్‌ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెంబరు. 02811 భువనేశ్వర్ - యల్హాంక జంక్షన్ రైలు ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18, 25 తేదీలలో, నెంబరు. 02812 యల్హాంక - భువనేశ్వర్ రైలు ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20, 27 తేదీల్లో నడుపుతామని ఈస్టు కోస్టు రైల్వే నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే ఈ రైళ్లు విజయవాడ తర్వాత నంద్యాలలోనే నిలుపుదల కల్పించారు. గుంటూరు డివిజన్‌లో ఎక్కువగా డిమాండ్ ఉండే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో నిలుపుదల సౌకర్యం కల్పించకపోవడం ఏమిటని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు రైల్వే శాఖని ప్రశ్నిస్తూ లేఖ పంపారు. అలానే నెంబరు. 02863/02864 హౌరా - యశ్వంత్‌పూర్ - హౌరా వీక్లీ ప్రత్యేక రైలు సర్వీసులను కూడా పొడిగించారు. వీటికి కూడా నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో నిలుపుదల కల్పించాలని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పులూరి శశిధర్‌చౌదరి రైల్వేకు లేఖ రాశారు.

డీజీపీ, ఎస్పీ సార్ నాపై ఏఏ కేసులున్నాయ్..!

- వివరాలివ్వండి.. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి లేఖ



జూలకంటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఏప్రిల్ 13: నామినేషన్లు దాఖలు చేసే సమయం దగ్గరపడుతుండడంతో మాచర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అప్రమత్తమయ్యారు. ఈనెల 7న సత్తెనపల్లికి వచ్చిన మాజీ సీఎం చంద్రబాబు బ్రహ్మారెడ్డికి ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినుంచి నీ మీద పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి సమాచారాన్ని తెప్పించుకోవాలని ఆదేశించారు. చంద్రబాబు సూచనల మేరకు ఇన్‌చార్జి డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ గరికపాటి బిందుమాధవ్‌కు రాతపూర్వకంగా వినతిపత్రం ఇచ్చి వివరాలను కోరినట్లు సమాచారం. కొన్ని కేసులు వివరాల్వికుండా రహస్యంగా ఉంచి పాలకపక్షం కుట్రలు చేసే అవకాశం వున్నందున బ్రహ్మారెడ్డి అప్రమత్తమయ్యారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ఆరంభం కానున్న దృష్ట్యా నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేసుల వివరాలు తప్పనిసరిగా ప్రమాణపత్రంలో పొందుపరచాల్సి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నామినేషన్‌ను పక్కనపెట్టే అవకాశం ఉంది. బ్రహ్మారెడ్డిని మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా 2021 డిసెంబరు 22 రాత్రి చంద్రబాబు ప్రకటించగా ఆ తరువాత భారీ ఊరేగింపుగా పేటసన్నెగండ్ల ఆలయంలో పూజ చేసి మాచర్లకు చేరుకునే క్రమంలో కేసులు నమోదయ్యాయి. అలాగే 2022 డిసెంబరు 16న మాచర్లలో పార్టీ కార్యాలయాన్ని ప్రత్యర్థి పార్టీ వారు దగ్ధం చేసి దాడులు చేసి బ్రహ్మారెడ్డిపైనే కేసు నమోదు చేశారు. ఇంకా 2003 ఆగస్టు 28న గొట్టిపాళ్ల ఘర్షణకు సంబంధించి బ్రహ్మారెడ్డిపై కేసు నమోదు చేశారు. (అప్పుడు బ్రహ్మారెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో వున్నారు). అదే సంవత్సరం డిసెంబరులో బ్రహ్మారెడ్డి కాన్వాయ్ మాచర్ల సమీపంలో ఓ వ్యక్తికి తగలడంతో ఎస్సీ, ఎస్టీ అత్యాచారక నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఈ క్రమంలో ఒక వేళ అక్రమ కేసుల వివరాలు అందని పక్షంలో ఆర్‌టీఐ(రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్) కింద సమాచారం కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. కాగా ఈనెల 16 లోపు కేసుల వివరాలివ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

మెప్మా ఎండీ.. సీఎం బంధువు

- ఆరున్నర ఏళ్లు గా అక్కడే వున్నారు
- డ్వాక్రా సంఘాలకు వైసీపీకి ఓటేయమని చెబుతున్నారు
- ఎన్నికల కమిషన్‌కు న్యాయవాది బాబు ప్రకాష్ ఫిర్యాదు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 13: మెప్మా ఎండీ విజయలక్ష్మిని వెంటనే విధుల్లో నుంచి తప్పించాలని ప్రముఖ న్యాయవాది కర్లపూడి బాబుప్రకాష్ మెయిల్ పంపారు. గత ఆరున్నర ఏళ్లగా ఆమె అదే పదవిలో కొనసాగుతున్నారని అందులో పేర్కొన్నారు. సీఎం జగన్ బంధువు కావటంతో తగిన అర్హత లేనప్పటికీ ఆమెకు ఎండీ పదవిని కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉండి విజయలక్ష్మి ఓటర్లను ప్రభావితం చేసేలా పావులు కదుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేలాది డ్వాక్రా సంఘాలను ప్రభావితం చేసి అధికార వైసీపీ లబ్ధి చేకూర్చాలని విజయలక్ష్మి ప్రయత్నం చేస్తున్నట్లు న్యాయవాది బాబుప్రకాష్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమెను ఆ పదవి నుంచిఇ తప్పించాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.96
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00



మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

వైసీపీ పాలనలో అన్నీ అరాచకాలే..

● దళితులు, మైనారిటీలపై దాడులు, అక్రమ కేసుల పరంపర

● జయహో బీసీ కార్యక్రమంలో యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13: ఐదేళ్ల వైసీపీ పాలనలో తుమ్మలచెరువు గ్రామంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నేతలపై దాడులు, అక్రమ కేసులే లక్ష్యంగా వైసీపీ నేతలు పనిచేశారే తప్ప అభివృద్ధి జరుపలేదని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి తుమ్మలచెరువు గ్రామంలో జయహో బీసీ కార్యక్రమంలో యరపతినేని పాల్గొని మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో టీడీపీ హయాంలో బీసీలకు సమన్యాయం చేశామని, 2019-24 మధ్య వైసీపీ పాలన వచ్చాక ఎందరి పైనో అక్రమ కేసులు, దాడులు చేశారన్నారు. టీడీపీ హయాంలో తుమ్మలచెరువు గ్రామంలో తాగునీటికి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తే వైసీపీ హయాంలో దానిని మూలన పడేశారని మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్లపాలనలో తుమ్మలచెరువులో అర్హులైన వారెందరికో టీడీపీకి చెందిన వారనే సాకుతో రేషన్‌కార్డులు, పింఛన్లు తొలగించారని, కొత్తవి మంజూరు చేయలేదన్నారు. రేపటి రోజున అధికారంలోకి వచ్చాక తుమ్మలచెరువు సమీపంలో వున్న సిమెంట్ పరిశ్రమలో యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని, ఇల్లులేని పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తీసుకుంటానని యరపతినేని భరోసా ఇచ్చారు.





యరపతినేనికి గజమాలతో ఘనస్వాగతం, సభకు హాజరైన ప్రజలు

గజ మాలతో ఘన స్వాగతం ..

తొలుత తుమ్మలచెరువుచెట్టు వద్ద పార్టీ నేతలు భారీ గజమాలతో యరపతినేనికి స్వాగతం పలికారు. అనంతరం జయహో బీసీ సభ వద్ద యరపతినేని శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, కొమ్మా పాండు, వీర్ల కృష్ణమూర్తి, రంజాన్‌వలి, గాలి మాణిక్యరావు, తెంపల్లి వెంకట రావు, గురుమూర్తి, మక్కెన రాజు, గున్నమరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణ, పిన్నబోయిన రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు...

గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో పిడుగురాళ్ల పార్టీకార్యాలయంలో పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారికి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు కార్యక్రమంలో గుర్రం శ్రీనివాసరావు, మీసాల శ్రీను, పెద్దమాను శ్రీను, ముద్దా అశోక్, ముద్దా బెంజిమెన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మాచవరం, ఏప్రిల్ 13: మండలంలోని వేమవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనివద్ద వున్న 20 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అమీనుద్దీన్ శనివారం తెలిపారు. వేమవరం గ్రామానికి చెందిన గుదె సుబ్బారావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి సుబ్బారావును అదుపులోకి తీసుకోని, అతనివద్ద బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు.

సూపర్ 6 పథకాలపై టీడీపీ నేతల ప్రచారం

పెదకూరపాడు, ఏప్రిల్ 13 : మండలంలోని బుచ్చయ్యపాలెంలో టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ - 6 పథకాల పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బాష్యం ప్రవీణ్‌ను, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు పరుచూరి పూర్ణచంద్రరరావు, శ్రీధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గౌతమ్‌రెడ్డి ప్రచారం

వెల్దుర్తి, ఏప్రిల్ 13: మండలంలోని యర్రబాలెం, లింగాపురంలలో శనివారం కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి అభినందన

నకరికల్లు, ఏప్రిల్ 13 : శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 978 మార్కులు సాధించిన జే.లక్ష్మీ ప్రసన్నను కేజీబీవీ ప్రిన్సిపాల్ కే.లక్ష్మీ, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి మంచి మార్కులు సాధించిన లక్ష్మీప్రసన్న ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

వ్యూహం ప్రకారమే దాడులు చేస్తున్నారు

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

● వైసీపీ దాడిలో గాయపడి చికిత్సపొందుతున్న వారికి పరామర్శ

మాచర్లటౌన్, ఏప్రిల్ 13: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ వ్యూహం ప్రకారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాడులు చేయిస్తుంటే, అతనికి పోలీసులు కొమ్ము కాస్తున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం రాత్రి రెంటచింతల మండలం తుమ్మకోటలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన పఠాన్ జలీల్‌ఖాన్, చాంద్‌వలిలు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బ్రహ్మారెడ్డి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతలు వారికి వ్యతరేకంగా వున్న సామాజికవర్గాల్లోని టీడీపీ నేతలను ఎంచుకొని, వైసీపీలోని అదే సామాజికవర్గం వారితో మరీ దాడులు చేయిస్తున్నారన్నారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో టీడీపీ ఎస్టీ నేతపై వైసీపీ ఎస్టీ నేతతో, కండ్లకుంటలో టీడీపీ యాదవ సామాజిక వర్గీయులపై వైసీపీకి చెందిన అదే సామాజిక వర్గీయులతో, కారంపూడి మండలం కాకానివారిపాలెంలో టీడీపీ ఎస్సీ వర్గీయులపై వైసీపీ ఎస్సీ వర్గీయులతో, ఇప్పుడు రెంటచింతల మండలం తుమ్మకోటలో టీడీపీకి చెందిన మైనార్టీలపై వైసీపీలోని మైనారిటీలతో దాడి చేయించారన్నారు. ఈ సంఘటనలో టీడీపీ నేతలపై పోలీసులు 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేశారని, వైసీపీ నేతల దాడులు పోలీసులకు కనపడవా అంటూ ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారని, ఇప్పటికైనా మేల్కొని పోలీసు ఉన్నతాధికారులు ఈ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాలని బ్రహ్మారెడ్డి కోరారు.

యరపతినేనికి జన్మదిన శుభాకాంక్షలు

మాచవరం, ఏప్రిల్ 13: గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి యరపతినేని శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభకాంక్షలు తెలియజేశారు. అనంతరం పార్టీ శ్రేణులకు స్వీట్ హాట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేమవరం టీడీపీ యూత్ నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే

వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయులు, వేదికపై బ్రహ్మారెడ్డి

● నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

● మాచర్ల మునిసిపల్ చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో ఒకటి ఎస్సీలకే : బ్రహ్మారెడ్డి హామీ

● కూటమి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

వెల్దుర్తి, ఏప్రిల్ 13: కూటమి అధికారంలోకి రాగానే ఏడాదిలోపే వరికపూడిశెల ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. మండలంలోని శిరిగిరిపాడులో శనివారం నిర్వహించిన కూటమి నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కూటమి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు మంజూరయ్యాయని, ప్రాజెక్ట్ నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండగా, నిధులు మంజూరులో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాజెక్ట్ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేసి ఏడాది లోపే ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు రూ.1200 కోట్లు మంజూరు చేయించానన్నారు. ప్రజలు తనను రెండోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు బ్రహ్మారెడ్డితో కలిసి కృషిచేస్తానన్నారు. రూ.2 కోట్లతో జెర్రివాగు మరమ్మతులు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు పిన్నెల్లి సోదరులు చేసిందేమీ లేదన్నారు. వారి అరాచకాలకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు బలైపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే కుర్రి పున్నారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావులు ప్రసంగించారు. కార్యక్ర ధారునాయక్, సామినేని నరసయ్య, కళ్లం రామాంజిరెడ్డి, పులుసు శివారెడ్డి, రాజబోయిన మధుసూదనరావు, వజ్రం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు.. శిరిగిరిపాడులోని ముదిరాజు, యాదవ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 100 కుటుంబాలు, మిట్టమీదపల్లెకు చెందిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన 35 కుటుంబాలు, బోదలవీడు, తుమ్మకోటకు చెందిన పలువురు శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు.

దుర్గి: మండలంలోని తేరాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ముటుకూరుకు చెందిన మరో 20 కుటుంబాలు కూడా టీడీపీలో చేరాయి.

కూటమి అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ..

మాచర్లటౌన్ : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శనివారం పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించిన మాచర్ల నియోజకవర్గ దళిత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో మాల, మాదిగలకు ఇబ్బంది లేకుండా న్యాయం చేస్తామన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో ఎస్సీ మాదిగ, మాలలకు ప్రత్యేక కమ్యూనిటీ భవనాలను తన సొంత నిధులతో నిర్మిస్తానని హామీనిచ్చారు. జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాచర్ల మునిసిపల్ చైర్మన్, లేదా మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయిస్తామన్నారు. సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, పేరువాల పుల్లారావు, బాబు, ప్రకాష్, యాకోబు, యేసోబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాలల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు



మాలల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

దళిత బహుజనుల ద్రోహి జగన్

● సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 : దళిత బహుజనులకు సీఎం వైఎస్ జగన్ తీరని ద్రోహం చేశారని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో శనివారం మాల మహానాడు నేత గుంటూరు ఆశీర్వాదం అధ్యక్షతన నియోజకవర్గ టీడీపీ మాలల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పోరేషన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ ఎటువంటి నిధులు, విధులు ఇచ్చిందిలేదన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యాదీవెన పథకాన్ని జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంగా మార్చి అంబేద్కర్‌ను సైతం అవమానించాడని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వస్తేనే మాలల అభివృద్ధి సాధ్యం అన్నారు. నియోజక వర్గంలోని మాలలంతా రానున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓటువేసి తనను, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని కన్నా పిలుపు నిచ్చారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించి అమరావతిని నిర్మించాలంటే ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించు కోవాలన్నారు. అనంతరం 'వైసీపీని ఓడిద్దాం.. అమరావతిని నిర్మిద్దాం" అనే కరపత్రాలను కన్నా, దళిత నేతలు ఆవిష్కరించారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామ స్వామి, సాతులూరి రామాంజనేయులు, ఏకుల రాజశేఖర్, పురం సుందరరావు, మట్టుపల్లి అచ్యుతరావు, తురుమెళ్ళ కోటేశ్వరరావు, దారా మునలయ్య, కొరబండి మస్తాన్, జెట్టి కోటేశ్వరరావు, మాలపాటి దావీదు, గాళ్ళ సుబ్రహ్మణ్యం, కడప రెడ్డెన్న, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం మండలంలో ఎన్నికల ప్రచారం..

రాజుపాలెం: మండలంలోని కొత్తూరు గ్రామంలో కన్నా లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి మెనిఫెస్టో గురించి తెలియజేసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కన్నా మాట్లాడుతూ సృష్టించి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే అనుభావం ఉన్న నాయకుడు ఇప్పుడు రాష్ట్రానికి అవసరమని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీని గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య, తెలుగు మహిళ మండల అధ్యక్షులు నెల్లూరి అహల్యారాణి ఉన్నారు.

పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి

పెదకూరపాడు, ఏప్రిల్ 13 : ఉపాధి పనులకు వెళ్ళిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లింగంగుంట్లలో శనివారం జరిగింది. ఎంపీడీవో మల్లేశ్వరి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వెనుబార్ల బాబు ఉపాధి పనికి వచ్చి పని చేస్తున్న ప్రదేశంలో కళ్ళు తిరిగి పడి పోయాడని, తోటి కూలీలు అతన్నీ ఆటోలో పెదకూరపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని ఆమె అన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 : పట్టణంలో నేటి నుంచి ఈనెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'అగ్ని భద్రత నిర్ధారించండి, దేశ నిర్మాణానికి సహకరించండి' అనే నినాదంతో వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలంతా కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు.

బిందేశ్వరి ప్రసాదు మండల్ వర్ధంతి

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 : పట్టణంలోని ఎన్‌జీవో హోం సెంటర్‌లో శనివారం బీసీల రిజర్వేషన్‌ల పితామహుడు బిందేశ్వరిప్రసాదు వర్ధంతిని నిర్వహించారు. బీసీ సంఘాల నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొంతా సాంబశివరావు, గుంటూరు గోవిందు, కే వెంకట్రామయ్య, కమలాకర్, రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మైనార్టీల ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 : పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ముస్లిం, నూర్‌బాషాల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు రాంబో బుడే శనివారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి సత్తెనపల్లి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం నాయకులంతా సమావేశానికి హాజరై జయప్రదం చేయాలన్నారు.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 13 : రానున్న ఎన్నికల్లో నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్ అన్నారు. మండలంలోని నందిగామ, గుడిపూడి గ్రామాల్లో శనివారం సీఐఎస్ఎఫ్, స్థాని పోలీసు సిబ్బందితో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగటానికి వీల్లేదన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ప్రజలను కోరారు.

కూటమితోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం

ముప్పాళ్ళ ఏప్రియల్ 13: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీరాలంటే కూటమి అధికారంలోకి వచ్చి, చంద్రబాబు సీఎం కావాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవ యాదవ్ అన్నారు. మండలంలోని రుద్రవరం, దమ్మాలపాడు, చాగంటివారిపాలెం గ్రామాలలో తెలుగుయువత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

అధికారంలోకి వస్తాం.. అభివృద్ధి చూపిస్తాం



మాట్లాడుతున్న నియోజక వర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రవీణ్

● టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

● ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం పట్టిన ప్రజలు

పెదకూరపాడు, ఏప్రిల్ 13 : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విధానాలతో విసిగి పోయిన ప్రజలు రానున్న ఎన్నికల్లో తమ కూటమిని అధికారంలోకి వస్తుందని, అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని బలుసుపాడులో శనివారం రాత్రి బాష్యం ప్రవీణ్‌కు గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రవీణ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత అభివృద్ధి పనులు చేస్తామని, స్థానికంగా నెలకొన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. మంచి ఆలోచనలు, నిర్ణయాలతో తాము ముందుకు వెళ్తున్నామని, తమను ఆశీర్వదించి సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ముందుగా తీన్‌మార్ వాయిద్యాలతో, బాణ సంచా కాల్పులతో, పూలతో ప్రవీణ్‌కు ఘన స్వాగతం పలికారు. స్థానిక లూథరన్ దేవాలయంలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. మహిళలు హారతులు ఇచ్చి తిలకం దిద్దారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ ఉమ్మడి కార్యాలయాన్ని ప్రవీణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజక వర్గ నేత పఠాన్ నూర్జహాన్, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరక్టర్ వర ప్రసాదు, జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త యర్రంశెట్టి రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, జనసేన అధ్యక్షులు మల్లెల చలపతిరావు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుంపాలెంలో భాష్యం ప్రవీణ్ సోదరి ప్రచారం..

అచ్చంపేట: బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ - 6 పథకాల వల్ల పేదలకు, నిరుద్యోగులకు ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుతుందని నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సోదరి పాటిబండ్ల శివరంజని అన్నారు. శనివారం రాత్రి మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో శివ రంజని ముమ్మర ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందజేసే పథకలు, కలిగే లబ్ధిగురించి వివరించారు. పాటిబండ్ల శివరంజని సమక్షంలో బీసీ కాలనీలో ఉప్పు కొండమ్మ, ఉప్పు శ్రీను, బీ.పెదబుజ్జి కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ స్థానిక టీడీపీ నాయకులు పోట్ల శ్రీనివాసరావు, సుంకర బుజ్జిబాబు, చిలుకా చిన సుబ్బారావు, కినిగిరి రామకృష్ణ, కందుల గణేష్, భాష్యం ప్రసాదు, మన్నెం భద్రయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థన అనంతరం క్రైస్తవులతో భాష్యం ప్రవీణ్



భాష్యం ప్రవీణ్‌కు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

వాహనంపై దాడి కేసులో

నిందితులపై ఎస్సీ ఎస్టీ కేసు

రెంటచింతల,ఏప్రిల్ 13 : ఈనెల 10న మంచికల్లులో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలకు సంబంధించి ప్రచార వాహానాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ధ్వంసం చేసిన కేసుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి చెప్పాడు.వ్యాన్ డ్రైవర్ కొండానాయక్ ఫిర్యాదు మేరకు గొంగటి అంజిరెడ్డి,డి.అంజిబాబు,డీ.అంజనేయులపై కేసు నమోదు చేశామన్నారు.కాగా శుక్రవారం రాత్రి తుమృకోటలో జరిగిన ఘటనకు సంబంధించి ఇరు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.వారిలో గోరేబూడి సైదా,కుత్బుద్దీన్ ప్రత్యర్థి వర్గానికి చెందిన షేక్ జానీ భాష,షేక్ భాషలతో పాటు మరి కొంత మంది వున్నారన్నారు.

పొందుగల చెక్‌పోస్టు వద్ద కమిషనర్ తనిఖీ

దాచేపల్లి, ఏప్రిల్ 13: ఏపీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ శ్రీనివాసరావు శనివారం గురజాల సెబ్ స్టేషన్, పొందుగల రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు వద్ద సెబ్ స్టేషన్‌ను తనిఖీచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అక్రమ మద్యం నిల్వలు వున్న గోడౌన్‌లు, నాటుసారా తదితర వాటిపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమమద్యం రాకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. కమిషనర్‌తో పాటు గురజాల సెబ్ స్టేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులున్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశానికి అర్హత పరీక్ష

నకరికల్లు, ఏప్రిల్ 13 : దేచవరం మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం పొందగోరు విద్యార్థులు ఈనెల 21న నిర్వహించే అర్హత పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కే.వేళాంగిని మేరి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

యరపతినేని పుట్టినరోజు వేడుకలు

● స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపిన జంగా

● 60 కిలోల భారీ కేక్ ఏర్పాటు



భారీ కేక్ కట్‌చేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



యరపతినేనికి స్వీట్ తినిపిస్తున్న జంగా

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13: గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు శనివారం నియోజకవర్గం అంతటా టీడీపీ, జనసేన, భాజపా శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత, టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో 60 కేజీల భారీ కేక్‌ను ఏర్పాటు చేశారు. టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తి తొలిసారిగా పట్టణ టీడీపీ కార్యాలయానికి రాగా ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు జంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో జంగా కృష్ణమూర్తి యరపతినేనిని హత్తుకొని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను యరపతినేని, జంగా కృష్ణమూర్తిలు కలిసి కట్‌చేశారు. మైనార్టీ సెల్, బీసీ సామాజికవర్గ నేతలు కేక్‌ను ఏర్పాటుచేయగా యరపతినేని కేక్‌ను కట్ చేశారు. వేదపండితులు, చర్చి పాస్టర్లు యరపతినేనిని ఆశీర్వదించారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, జడ్పీటీసీ వెంకట కోటయ్య, మాశెట్టి పుల్లారావు, మండల పార్టీ కన్వీనర్లు పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ భద్రి, లక్ష్మీనారాయణ తదితర నేతలు యరపతినేనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నేతలు కామిశెట్టి రమేష్‌తో పాటు పలువురు సాయి వృద్ధాశ్రమంలో పండ్లు అందజేసి అన్నదానం చేశారు.

యరపతినేనికి చంద్రబాబు, లోకేష్ శుభాకాంక్షలు :

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లు శనివారం ఫోన్‌లో యరపతినేనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. యరపతినేనితో వారు ఫోన్‌లో మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, పార్టీ శ్రేణులకు అండగా వుంటున్న నీలాంటి వ్యక్తి పల్నాడులో పార్టీకి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

వాడవాడలా యరపతినేని జన్మదిన వేడుకలు

గురజాలటౌన్: కూటమి గురజాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను శనివారం గురజాల పట్టణంతోపాటు మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. మండలలోని దైద అమరలింగేశ్వరస్వామి దేవస్థానం, పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. టీడీపీ ఆఫీసులో కేక్ కటింగ్ చేశారు. అలాగే పట్టణంలోని ఆనిగ్రేస్ వృద్ధాశ్రమం, గంగవరంలోని అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. మర్కస్ మసీదులో దువా జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

దాచేపల్లి : యరపతినేని శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలలో భాగంగా దాచేపల్లిలోని నాగేంద్ర సహిత గంగాభవాని సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో కూటమి నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చి, మసీదులలోనూ ప్రార్థనలు చేయించారు.

రెంటచింతల: మండలంలోని మంచికల్లుకు చెందిన యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను రెంటచింతలలో నిర్వహించారు. మంచికల్లులో యరపతినేని సోదరుడు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి, రామకృష్ణ, రవికృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.



యరపతినేనితో కేక్ కట్‌చేయిస్తున్న మైనారిటీ నేతలు

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బొల్లాపల్లి దాహార్తిని తీర్చేది టీడీపీ మాత్రమే

● కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు



మూగచింతలపాలెంలో సూపర్ - 6 పథకాలపై మహిళలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 13: మండలంలోని మూగచింతలపాలెం, బొల్లాపల్లిలో శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతో పాటు తెలుగుదేశం అందిస్తున్న సూపర్- 6 పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లాపల్లి దాహార్తి తీర్చేది కూటమి ప్రభుతమేనని అన్నారు. అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే వరికపూడిసెల, ఎత్తిపోతలను తక్షణమే మొదలుపెట్టి పూర్తి చేసి వాటర్‌గ్రిడ్ ద్వారా వినుకొండ నియోజకవర్గంలో ఇంటింటికి కుళాయి ద్వారా రక్షిత నీరు అందించే కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జరపాల గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఆళ్ళ మన్నెయ్య, పోకా వెంకటరావు, బొడ్డపాటి యలమంద, హనుమంతరావు, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జగన్‌ను నమ్మడానికి ప్రజలంతా సిద్ధంగా లేరు

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఒకటో వార్డులో కుమారుడు హరిష్‌తో కలిసి ప్రచారం



హరీష్‌రావును సన్మానిస్తున్న వార్డు ప్రజలు

వినుకొండటౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని ఒకటో వార్డు వెన్నపూసకాలనీకి చెందిన 20 కుటుంబాలు అధికార వైసీపీ నుంచి శనివారం టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తన కుమారుడు హరిష్ బాబులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో భాగంగా జీవీ మాట్లాడుతూ భవిష్యత్‌పై సొంత పార్టీలో నమ్మకం కల్గించలేని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 5కోట్ల మంది ప్రజలు ఎలా విశ్వసిస్తారో చెప్పాలని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. నమ్మి ఓటు వేసిన ప్రజలతోపాటు నడిచిన వారందరిని నిలువునా ముంచబట్టే వైసీపీలో ఇమడిలేక బయట మార్గాల వైపు చూస్తున్నారని జీవీ ఎద్దేవా చేశారు. వారంతట వారే జగన్‌కు గత ఎన్నికల్లో ఎందుకు మద్దతు ఇచ్చామని పశ్చాతాపంతోనే పసుపు కండువా కప్పుకుంటున్నారని అన్నారు. ముఖ్యంగా గడిచిన ఐదేళ్ళలో పల్లెల అభివృద్ధిని వైసీపీ పూర్తిగా గాలికి వదిలేసిందని పంచాయతీలకు చెందిన వేలకోట్ల రూపాయల నిధుల మళ్ళింపుతో కనీసం అవసరాలు కూడా ఇబ్బంది పడే పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన చిన్నచిన్న హామీలు కూడా నెరవేర్చలేక వైసీపీ తరపున ఓట్లు అడగడానికి మొఖం చెల్లక క్షేత్రస్థాయి నేతలంతా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు నిశంకర శ్రీనివాసరావు, పట్టణ అధ్యకుడు ఆయూబ్‌ఖాన్ తోపాటు పలువురు నాయకులు, వార్డులోని ప్రముఖులు పాల్గొన్నారు.

ఇనిమెళ్ళ నుంచి టీడీపీలో చేరికలు

ఈపూరు, ఏప్రిల్ 13 : మండలంలోని ఇనిమెళ్ళ గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు వైసీపీ నుంచి జీవీ ఆంజనేయులు సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

చంద్రబాబునాయుడుతోనే రైతులకు మేలు

● తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావు

నాదెండ్ల, ఏప్రిల్ 13 : రైతులకు మేలు చేసింది చంద్రబాబునాయుడు మాత్రమేనని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. మాజీ సీఎం చంద్రబాబు రైతులకు ఏమి చేయలేదని ముఖ్య మంత్రి జగన్ చేసిన విమర్శలను ఆయన ఖండించారు. రైతులకు 17 వేల కోట్ల రూపాయల రుణమాఫీ, రాయితీపై ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, బిందు, తుంపర సేద్యం లాంటి పరికరాలను అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. పోలవరం 80శాతం పూర్తి చేయగా జగన్ ఆ ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని విమర్శించారు.


మాలమహానాడు మండలాధ్యక్షుడిగా రవిబాబు



రవిబాబుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న సీనియర్ నాయకులు

శావల్యాపురం, ఏప్రిల్ 13: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆదేశాల మేరకు శావల్యాపురం మండల మాలమహానాడు అధ్యక్షుడిగా కొమ్మతోటి రవిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వినుకొండ నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినుకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో మాలమహానాడు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కోండ్రు విజయ్ చేతుల మీదుగా రవిబాబుకు నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. మాలమహానాడు నాయకులు విప్పర్ల విజేంద్ర రావు, మాలపాటి బాగ్యరాజు, పిడతల రాజు, ఇశ్రాయేలు, విజయరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ తదితరులు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 13: పట్టణంలోని కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం విడుదల అయిన 2024 ఇంటర్మీడియట్ ఫలితాల్లో 'శ్రీకృష్ణ చైతన్య కళాశాల' విద్యార్థులు మొదటి సంవత్సరం 'ఎంపీసీ' విభాగంలో 'దూదేకుల మునీర్ 470 మార్కులకు గాను 464 మార్కులతో స్టేట్ 3వ ర్యాంక్ కైవసం చేసుకున్నారన్నారు. బి.గోపిచంద్ 463, ఎన్‌వీ రవి 463, పివీసీ కృష్ణారెడ్డి 462, బి.శ్రీకాంత్ 461, కె.నాగలక్ష్మి 460, వి.పుష్పకల్పన 460, 'బైపీసీ' విభాగంలో వి.శ్రావణశ్రీ 440కి గాను 430, కె.షాహిన్ 412 మార్కులు, 460పైన ఏడుగురు, 450పైన 15మంది, 400పైన 37మంది విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థులను, అధ్యా పకులకు శ్రీకృష్ణచైతన్య విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ఎన్‌వీఆర్ లక్ష్మీదేవి, అకడమిక్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొల్లి కృష్ణారావు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే

వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తాం

● నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

● మాచర్ల మున్సిపల్ చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో ఒకటి ఎస్సీలకే : బ్రహ్మారెడ్డి హామీ

● కూటమి నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 13: కూటమి అధికారంలోకి రాగానే ఏడాదిలోపే వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. మండలంలోని శిరిగిరిపాడులో శనివారం నిర్వహించిన కూటమి నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కూటమి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు మంజూరయ్యాయని, ప్రాజెక్ట్ నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండగా, నిధులు మంజూరులో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాజెక్ట్ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేసి ఏడాది లోపే ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు రూ.1200 కోట్లు మంజూరు చేయించానన్నారు. ప్రజలు తనను రెండోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు బ్రహ్మారెడ్డితో కలిసి కృషిచేస్తానన్నారు. రూ.2 కోట్లతో జెర్రివాగు మరమ్మతులు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు పిన్నెల్లి సోదరులు చేసిందేమీ లేదన్నారు. వారి అరాచకాలకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు బలైపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే కుర్రి పున్నారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావులు ప్రసంగించారు. కార్యక్ర ధారునాయక్, సామినేని నరసయ్య, కళ్లం రామాంజిరెడ్డి, పులుసు శివారెడ్డి, రాజబోయిన మధుసూదనరావు, వజ్రం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు..

శిరిగిరిపాడులోని ముదిరాజు, యాదవ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 100 కుటుంబాలు, మిట్టమీదపల్లెకు చెందిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన 35 కుటుంబాలు, బోదలవీడు, తుమ్మకోటకు చెందిన పలువురు శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు.

దుర్గి: మండలంలోని తేరాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ముటుకూరుకు చెందిన మరో 20 కుటుంబాలు కూడా టీడీపీలో చేరాయి.

కూటమి అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ..

మాచర్లటౌన్ : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శనివారం పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించిన మాచర్ల నియోజకవర్గ దళిత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో మాల, మాదిగలకు ఇబ్బంది లేకుండా న్యాయం చేస్తామన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో ఎస్సీ మాదిగ, మాలలకు ప్రత్యేక కమ్యూనిటి భవనాలను తన సొంత నిధులతో నిర్మిస్తానని హామీనిచ్చారు. జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాచర్ల మున్సిపల్ చైర్మన్, లేదా మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయిస్తామన్నారు. సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, పేరువాల పుల్లారావు, బాబు, ప్రకాష్, యాకోబు, ఏసోబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణ దేవరాయలు

మోసానికి, వంచనకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

● 60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 13: మేమంతా సిద్ధం సభల్లో మంచికి అండగా నిలవాలని చిలక పలుకులు పలుకుతూ మోసానికి, వంచనకు సీఎం జగన్ ఒక బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జగన్‌కు ప్రజలే కీలెరిగి వాతలు పెట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. పనిలో పనిగా వైసీపీ తన ఎన్నికల గుర్తును ఫ్యాన్ నుంచి గొడ్డలికి మార్చుకుంటే మేలని ఎద్దేవా చేశారు. శనివారం టీడీపీ నాయకులు రత్నారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 28, 29 వార్డులకు చెందిన ఆషిక్ సుభానీతో పాటు 50కుటుంబాలు, షేక్ షారూక్ ఆధ్వర్యంలో 27వ వార్డుకు చెందిన పది కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వార్డుల్లో ప్రచారం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారందరికీ ప్రత్తిపాటి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కూటమి గెలిచిన ఐదేళ్లల్లో పేదల ఆదాయం రెట్టింపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఐదు సంవత్సరాల్లో పేదల ఆదాయం రెట్టింపు చేసి తీరతామని మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ కూటమి శాసనసభ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. పేదలను సంపన్నులను చేసి పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌ను చూడాలన్న చంద్రబాబు సంకల్పంలో ఆదాయం పెంపే కీలకమైన అంశం అన్నారు. ఒక వైపు పన్నులు, చార్జీల అదుపు, మరో వైపు ఆదాయ వృద్ధితో ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. శనివారం పట్టణంలోని 22, 23 వార్డుల కుటుంబ సాధికార సారధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల వ్యూహం, ప్రచార కార్యక్రమాలపై దిశ, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి తీరతామని ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లోనే ఈ విషయాన్ని స్పష్టం చేశారని ఆయన గుర్తు చేశారు. శనివారం పట్టణంలోని 32వ వార్డులో జరిగిన జయహో బీసీ క్లస్టర్ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు బీసీలకు వెన్నుదన్నుగా ఉన్నది టీడీపీయేనని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బీజేపీ కన్వీనర్ జయ రామిరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్, అవ్వారు బసవయ్య, బిట్ర బ్రహ్మం, అవ్వారు రమేష్, జంజనం వెంకటేశ్వర్లు, బిట్ర రాజేంద్ర, అవ్వారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలికి పవన్‌కల్యాణ్

● సభలో ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల

● ఏర్పాట్లను పరిశీలించిన నాదెండ్ల మనోహర్



సభాప్రాంగణం వద్దకు ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి వస్తున్న నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13: గతంలో వాయిదా పడిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన తాజాగా ఖరారైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారు. ఆయన తెనాలి రావడం ఇదే తొలిసారి కావడంతో పవన్ అభిమానులు, జనసేన శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్ ద్వారా తెనాలి సుల్తానాబాద్‌లోని హెలిప్యాడ్ వద్దకు పవన్ చేరుకుంటారని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అక్కడి నుంచి వారాహి వాహనంపై పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చెంచుపేట, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదగా మహాత్మా గాంధీ మున్సిపల్ మార్కెట్లోని పురవేదిక వద్దకు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం జరిగే బహిరంగ సభలో పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ పర్యటన, బహిరంగసభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామని మనోహర్ తెలిపారు. ఈ సభకు గుంటూరు, బాపట్ల, కృష్ణ జిల్లాల నుంచి ఉమ్మడి పార్టీల నాయకులు, శ్రేణులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరవుతారని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లును శనివారం కూటమి నేతలతో కలిసి మనోహర్ పరిశీలించారు. పవన్ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను ఆయన కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో పవన్‌కల్యాణ్ ప్రజల ముందుంచుతారని తెలిపారు. కార్మికులు, రైతు లు, కౌలు రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి చేపట్టబోయే పరిష్కారాలను కూడా ప్రస్తావిస్తారన్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో 76శాతం ఉత్తీర్ణత



జ్యోతి



పుష్పలత

శావల్యాపురం, ఏప్రిల్ 13: స్థానిక జడ్పీ పాఠశాలలో ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన మహిళా జూనియర్ కళాశాల్లోని విద్యార్థినులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యున్నతమైన ప్రతిభ కనబరచి 76శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి శనివారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మొత్తం 33మంది విద్యార్థినులు ఇంటర్ పరీక్షలు రాయగా 25మంది ఉత్తీర్ణులయ్యారని, ఎంపీసీలో 20 మందికి గాను 15 మంది, బైపీసీలో 13 మందికి గాను 10 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఎంపీసీలో 470 మార్కులకు ఓర్సు జ్యోతి 446 ప్రథమస్థానం, ఏలూరి పుష్పలత 441 ద్వితీయ స్థానం, గంపా దేవరాణి 438, ముద్దా అఖిత 431మార్కులు సాధించారని, బైపీసీలో 440 మార్కులకు మహిమారాణి 346 మార్కులు సాధించినట్లు తెలిపారు. మహిళా జూనియర్ కళాశాల ప్రారంభించిన తొలి ఏడాదిలోనే విద్యార్థినులు మంచి ఫలితా లు సాధించడం శుభపరిణామమన్నారు. ప్రతిభచూపి మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ఉపాధ్యాయులు కె.శ్రీనివాస రాజు, సురేష్, కిరణ్మయి, కవిత, ఉన్నం శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఎన్నికల వేళ ఇంటింటికి పైపు లైన్



రామలింగాపురంలో గుట్టుచప్పుడు కాకుండా పైపులైన్ వేస్తున్న సిబ్బంది

వినుకొండటౌన్, ఏప్రిల్ 13 : మండలంలోని నీల గంగవరం పంచాయతీ పరిదిలోని రామలింగాపురంలో జలజీవన్ స్రవంతి పథకం ద్వారా ఎన్నికల వేల గుట్టు చప్పుడు కాకుండా ఇంటింటికి పైపు లైన్ వేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 21లక్షల రూపాయలతో గ్రామంలో నూతన పైపు లైన్ నిర్మించి ఇంటింటికి కుళాయిను ఏర్పాటు చేసేందుకు అధికారులు 2023 డిసెంబర్ 11వ తేదీన టెండర్లు పిలిచారు. కంభం నుంచి ఒక కాంట్రాక్టర్ పనులు దక్కించుకొని సుమారు 5 నెలలుగా పనులు జరగకుండ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పనులు ప్రారంభించడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. కేవలం మూడు రోజుల వ్యవధిలో గ్రామంలోని వీధులన్నింటికి ప్రధాన పైపు లైన్ నిర్మించి ఇంటింటికి కుళాయి పైపులైన్ అందిస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌రెడ్డిని వివరణ కోరగా గతంలో పైపు లైన్ నిర్మించేందుకు టెండర్లు పిలిచామని ఆర్వో అభ్యంతరం చెబితే పనులు నిలుపుదల చేస్తామని ఆయన తెలిపారు.



పైపులైన్ నిర్మించేందుకు పనులు చేస్తున్న ప్రొక్లెయిన్

రాష్ట్ర భవిష్యత్తు కోసమే ఉమ్మడి పోరాటం

● టీడీపీకి పూర్వ వైభవమే లక్ష్యంగా పనిచేయాలి

● రానున్న 30 రోజులు కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలి

● లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 13: రాష్ట్ర భవిష్యత్తు, మన బిడ్డల భవిష్యత్తు కోసమే రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పోరాటం చేస్తున్నట్లు నరసరావుపేట టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రానున్న 30రోజులు కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణంలో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి జమీందార్ ఫంక్షన్ హాలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. అనంతరం జమిందార్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన లావు కృష్ణదేవరాయలు, చదలవాడ అరవిందబాబులు నరసరావుపేటలో మార్పు మొదలైందని అన్నారు. టీడీపీలో మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పార్టీలో చేరటం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగ్గాపురంలో సూపర్ సిక్స్, శంఖారావం

● హాజరుకానున్న ప్రత్తిపాటి, ఎంపీ లావు, జనసేన, బీజేపీ నాయకులు

యడ్లపాడు, ఏప్రిల్ 13 : యడ్లపాడు మండలం జగ్గాపురంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ శంఖారావం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డిలు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రచార కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు కార్యక్రమలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 13: నరసరావుపేట అగ్నిమాపక కేంద్ర పరిధిలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు అగ్నిమాపక శాఖ అధికారి ఎంవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా విధుల్లో ప్రాణాలర్పించిన అగ్నిమాపక వీరులకు నివాళులర్పిస్తామన్నారు. వైద్యశాలలు, అపార్టుమెంట్‌లు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లు, రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో పల్నాడు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎస్ శ్రీధర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

టీడీపీ గెలిస్తేనే భావితరాలకు భవిష్యత్తు



సూపర్- 6 కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నాదెండ్ల, ఏప్రిల్ 13: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నేతలు తెలిపారు. మండలంలోని గణపవరంలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీకృష్ణదేవరాయలు, ప్రత్తిపాటి పుల్లారావుల విజయాన్ని కాంక్షిస్తూ రాజీవ్‌గాంధీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మినీ మేనిఫెస్టోలోని సూపర్- 6 పథకాల గురించి కాలనీవాసులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, చదువుకొనే ప్రతి పిల్లవాడికి ఆర్థిక సాయం తదితరాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సీతాలాంబ దేవికి పూజలు చేశారు. చర్చి, మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ హిమవంతరావు, నాయకులు అచ్చయ్య, శ్రీనివాసరావు, బుచ్చయ్య, శ్రీధర్, హరిబాబు, ప్రభుదాసు, ఏబు తదితరులు పాల్గొన్నారు.

వ్యూహం ప్రకారమే దాడులు చేస్తున్నారు

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

● వైసీపీ దాడిలో గాయపడి చికిత్సపొందుతున్న వారికి పరామర్శ



గాయపడిన వారిని పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 13: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ వ్యూహం ప్రకారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాడులు చేయిస్తుంటే, అతనికి పోలీసులు కొమ్ము కాస్తున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆరోపించారు. శుక్రవారం రాత్రి రెంటచింతల మండలం తుమ్మకోటలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన పఠాన్ జలీల్‌ఖాన్, చాంద్‌వలిలు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బ్రహ్మారెడ్డి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతలు వారికి వ్యతిరేకంగా ఉన్న సామాజికవర్గాల్లోని టీడీపీ నేతలను ఎంచుకొని, వైసీపీలోని అదే సామాజికవర్గం వారితో మరీ దాడులు చేయిస్తున్నారన్నారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో టీడీపీ ఎస్టీ నేతపై వైసీపీ ఎస్టీ నేతతో, కండ్లకుంటలో టీడీపీ యాదవ సామాజిక వర్గీయులపై వైసీపీకి చెందిన అదే సామాజిక వర్గీయులతో, కారంపూడి మండలం కాకాని వారిపాలెంలో టీడీపీ ఎస్సీ వర్గీయులపై వైసీపీ ఎస్సీ వర్గీయులతో, ఇప్పుడు రెంటచింతల మండలం తుమ్మకోటలో టీడీపీకి చెందిన మైనార్టీలపై వైసీపీలోని మైనారిటీలతో దాడి చేయించారన్నారు. ఈ సంఘటనలో టీడీపీ నేతలపై పోలీసులు 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేశారని, వైసీపీ నేతల దాడులు పోలీసులకు కనపడవా అంటూ ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారని, ఇప్పటికైనా మేల్కొని పోలీసు ఉన్నతాధికారులు ఈ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాలని బ్రహ్మారెడ్డి కోరారు.